# మా అబ్బాయి డ్రగ్స్ తీసుకోలేదు

- అరెస్టు కూడా కాలేదు : ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

'మా అబ్బాయి భరత్‌రెడ్డి డ్రగ్స్ తీసుకోలేదు. అరెస్టు కూడా కాలేదు. డ్రగ్స్ తీసుకున్నట్టు, మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేసినట్టు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు'అని ఎమ్మెల్సీ పి వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియాలో వస్తున్న వార్తలు నిరాధారమని పేర్కొన్నారు. గురువారం ఉదయం మంగళ్‌హాట్ పోలీసులు తమ ఇంటికి వచ్చి డ్రగ్స్‌కు సంబంధించిన విచారణ జరుపుతున్నామనీ, ఇందుకు సహకరించాలని కోరారని తెలిపారు. పోలీసుల విచారణలో తన కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని తేలిందని వివరించారు. కామన్ ఫ్రెండ్స్ ఫోన్ జాబితాలో ఉన్నవారెవరి నెంబర్‌లోనో ఒకరి వద్ద ఉన్న సమాచారం ఆధారంగా విచారణ జరిపారని పేర్కొన్నారు.

## కక్షతో పిటిషన్.. లక్ష జరిమానా

**నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్**

వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి కోర్టులను వేదికగా ఉపయోగించుకునే ఉద్దేశంతో దాఖలయ్యే పిటిషన్లను అనుమతించబోమని హైకోర్టు స్పష్టం చేసింది. వాస్తవాలను దాచిపెట్టి కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు నిజామాబాద్‌కు చెందిన మాజీ ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను రూ.లక్ష జరిమానాతో కొట్టివేసింది. ఈ మొత్తాన్ని మలక్‌పేట అంధ బాలికల పాఠశాలకు చెల్లించాలని ఆదేశించింది. నిర్మల్ జిల్లా పంగిరి గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న ప్రభురాజ్ సాగర్‌పై 2022లో చేసిన ఫిర్యాదుపై అధికారులు చర్యలు తీసుకోలేదంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్ విచారణ చేపట్టారు. పిటిషనర్ 2017లో పదవీ విరమణ చేసిన తర్వాత 2016 నాటి సంఘటనలపై ఫిర్యాదు చేయడం అనుమానాస్పదంగా ఉందని, ఇరువురూ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్న విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాకుండా వాస్తవాలను దాచిపెట్టారని న్యాయమూర్తి పేర్కొన్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి వ్యక్తిగత కక్ష తీర్చుకోవాలనే ఉద్దేశంతో పిటిషన్ దాఖలు చేసినట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు.

## రివ్యూ పిటిషన్ డిస్మిస్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

కారుణ్య నియామకానికి సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కొత్త అంశాలతో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం కుదరదని పేర్కొంటూ జస్టిస్ సురేపల్లి నంద ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. శశి మరణంతో కారుణ్య నియామకం కోరిన పి. కవిత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని గతంలో హైకోర్టు ఆదేశించినప్పటికీ వాటర్ బోర్డు రివ్యూ కోరింది. అదే సమయంలో కోర్టు ఆదేశాలను అమలు చేయలేదంటూ కవిత ధిక్కరణ పిటిషన్ కూడా దాఖలు చేశారు. రివ్యూ అనేది అప్పీలుకు ప్రత్యామ్నాయం కాదని, రికార్డులో స్పష్టమైన తప్పు ఉన్నప్పుడే దాన్ని చేయాల్సి ఉంటుందని పేర్కొన్న న్యాయస్థానం రివ్యూను తిరస్కరించింది. అలాగే పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి కారుణ్య నియామకంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ ధిక్కరణ పిటిషన్‌ను ముగించింది.